# ప్రబుద్ధాంధ్రుడు

"ప్రబుద్ధాంధ్ర" అనగా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి మాస పత్రిక; మానస పుత్రిక.

దాని సంవత్సర చందా ఒక రూపాయి. అంటే ఒక సంచిక ఖరీదు సుమారు అయిదు కాన్ల చిల్లర. ఇప్పుడయితే ఆ పత్రిక పంపడానికి ఉపయోగించే కవరు కాగితపు పీలికలకు చాలదు రూపాయి.

అప్పుడాయన ఆ రూపాయితో కాగితం, అచ్చు, తపాలా ఖర్చు, తను తిరగడానికి దారి ఖర్చు అన్నీ సరిపుచ్చుకునేవారు పాపం.

నెలలో ఇరవై రోజులు చందాలకోసం దేశంలో తిరగడం; పది రోజులు రాజమహేంద్రవరంలో వుండి పత్రిక పనిచూడడం. కంభంవారి వీధిలోవున్న సరస్వతీ ప్రెస్సునుంచి స్వయంగా అచ్చయిన పత్రికలు మోసి తెచ్చి ఇంటిదగ్గర ఒక్కరూ అడ్రసులు వ్రాసి పోస్టుచేసేవారు. సహాయానికి బావమరది కుర్రాడు ఒకతను ఎప్పుడేనా వుండేవాడు.

కలబరిగి వారింట్లో — ఇన్నీసుపేటలో మకాం. చావడిలో ఒక చిన్న గది. దానిలో టేబిలు కుర్చీతోసహా ఒక్కరికే చోటు. చుట్టూ పత్రికల కట్టలు, "కట్" చేయగా వచ్చిన సన్నని కాగితపు పీలికల అడివి. వాటి మధ్య పనిచేస్తూ ఊపిరిసలపని శాస్త్రిగారు. వెళ్ళి పలకరించడానికి భయంగా వుండేది. ఆయన పని చెడుతుందని.

తగిన సమయంచూసి వెడితే ప్రాణం పెట్టేవారు. పనిలో వుంటే ఇంగితం కనిపెట్టి వెళ్ళిపోవడం మంచిది. లేకపోతే - ఆయన ముఖం ముడుచుకున్న మందార పువ్వులా వుండేది, ఎర్ర ఎర్రగా నిర్వికారంగా.

అంతకుపూర్వం ఏడెనిమిదేండ్ల కిందట ఒకసారి ప్రబుద్ధాంధ్ర పెట్టడం, ఏడాదో రెండేళ్లో నడిచి ఆగిపోవడం జరిగింది. అప్పుడూ చందా రూపాయే. అప్పుడు పద్యాలు ప్రచురించేవారు. ఇప్పుడు పద్య నిషేధం. ప్రబంధ వాఙ్మయంలో పూర్వం నిర్వచన కావ్యాలుండేవి. వచనం లేకుండా ఉంటే అప్పుడు గొప్ప. రోజులు మారిపోయాయి. పద్యాలు చాలామందికి అర్థంకావు. పద్యాలు పరిమిత ప్రయోజనాలు. మన భావ ప్రచారానికి వచనం చాలా అవసరం. ప్రజలలో విద్యావ్యాప్తికి విషయ వివరణానికి వచనం చాలా అనువు. ఆ వచనంకూడా జిడ్డు తెనుగులో వుండకూడదు. సరళంగా చదివితే వెంటనే బోధపడేలా వుండాలి. ఈ అవగాహనతో వచనం వ్రాసినవారు వీరేశలింగంగారు.

రాజమండ్రిలో నవ్యభావ పరులందరికీ వీరేశలింగంగారు మానసిక గురువు అంతేకాక శాస్త్రిగారి సంఘసంస్కార ప్రీతికిన్ని గురువు కందు కూరివారే.

కాబట్టి—సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వచనాభిమానం అసాధారణ మయినది. పత్రికలో వచనం తప్ప పద్యం, పాదం మోపరాదని శపథం చేసు

[illegible]న్నారు. ఇందువల్ల పద్యాభిమానులు దూరమయ్యారు. అంతేకాదు ఆయన కాంగ్రెసన్నా, ఖద్దరన్నా బద్ధ విరోధి. హిందీ అంటే చెవులు మూసుకునేవారు. ఆ రోజుల్లో ఈ మాట లని ప్రతిఘటం ఎంత కష్టమో ఊహించుకోవచ్చు. ఆయనది రావణా పట్టుదల. ఇక్కడ ఒక ముచ్చట జ్ఞాపకం వస్తుంది.

సుబ్బమ్మగారి బాలికా పాఠశాల వీరభద్రపురంలో వుండగా ఒకసారి శాస్త్రిగారు ఎందుకో పాఠశాలకు వచ్చారు. సుబ్బమ్మగారు శాస్త్రిగారిని చాలా ఆదరించారు. ఇద్దరూ వెలనాటి వారవడంవల్ల ఎక్కడో బాదరాయణ సంబంధం కలుపుకుని అన్నగారూ, చెల్లెలూ అంటూ అమిత ఆపేక్షగా మాట్లాడుకున్నారు. మాటలయిన తర్వాత సుబ్బమ్మగారు అన్నగారూ, ఈ పూటకు సరదాగా ఇక్కడ భోంచేయమన్నారు. శాస్త్రిగారు ఒక నియమం పుందన్నారు. ఏమిటంటే నే నిక్కడ వున్నంతసేపూ హిందీ మాట విని పించకూడదు. వినపడిందో తక్షణం లేచి వెళ్ళిపోతానన్నారు. అంతా నవ్వు కున్నాం. భోజనానికి అంగీకరించారు. మంచి వంట ఏర్పాటయింది. భోజ నానికి లెమ్మని పిలుపు వచ్చింది. ఆయత్తం అవుతున్నాం.

రాత్రి ఎనిమిది అవుతుంది. పాఠశాల బాలికలు ప్రార్థనచేసి భోజ నాలు చేస్తారు. వందేమాతరం, "తెలుగు" పాటలు పాడారు. ప్రార్థన ముగిసింది. చట్టున ఒక పిల్ల అలవాటుగా "బోలో స్వతంత్ర భారత్‌కీ జయ్" అంది. శాస్త్రిగారు గుమ్మందాటి వంటింట్లోకి వెడుతున్నారు. ఈ మాట వినపడింది. టక్కున శాస్త్రిగారు చొక్కా తొడుక్కొని చెప్పులు విసురుగా వేసుకొని తిరిగిచూడకుండా వెళ్ళిపోతున్నారు. సుబ్బమ్మగారు నొచ్చుకొని "క్షమాపణ" చెప్పి వుండమన్నారు. మేం బతిమాలాము. నసేమీ - బదులు చెప్పలేదు. వెళ్ళిపోతున్నారు. గుమ్మం దాటేశారు. వెళ్ళిన్నిపోయారు. ఇది ఆయన పట్టుదలకు ఒక మచ్చుతునక.

ఏటికి ఎదురీత అయిన ఈ పట్టుదలతో ఆయన లోకంలో నెగ్గుకు వచ్చారంటే ఎంత ప్రాణశక్తి వచస్సారం ఖర్చుపెట్టి ఉంటారో అని పిస్తుంది.

ఆయన పట్టుదలలో వున్న నిజాయితీవల్ల తెనుగు నుడికారానికి ఆయన కూర్చిన వైభవంవల్ల ఆయన తాలూకు చిన్న కథలంటే చెవికోసు కోవడంవల్ల దేశీయులు ఆ కౌశిక సగోత్రుని సంతోషంగా భరించారు.

దేశమంతా తిరిగి మధువ్రతంలా ఒక్కొక్క బొట్టు సంపాదించి తెచ్చి, తేనె వట్టువంటి ప్రబుద్ధాంధ్రను నడిపేవారు. ప్రతి సంచికలోను ఒక కథ తప్పకుండా ఆయనది వుండేది. ఇచ్చే రూపాయి ఆ ఒక్క కథకు చాలు అనుకునేవారు చందాదారులు. ఇంకా అందులో మీగడ తరకలు, పత్రికలు - వేదికలు అనే శీర్షిక లుండేవి. వాటిలో శాస్త్రిగారి పదునైన విమర్శలుండేవి. అవి చదువుకునేటప్పుడు శాస్త్రిగారి వాడి తెలిసేది. ప్రతి దానిలోను రాజీలేని తీవ్ర ధోరణే కదా! కాంగ్రెసంటే ఒంటికాలిమీద లేవడమే! అయినా కాంగ్రెసభిమానులు అడవి బాపిరాజుగారు, కాటూరి వెంకటేశ్వరరావుగారూ, ఆయనంటే ఎంతో ఇష్టంగా వుండేవారు.

రెండోసారికూడా తన ఓటమి ఒప్పుకుని పత్రిక ఆపేసి బజార్లో మందులకొట్టు పెట్టారు. ఆయనకు ఆయుర్వేద వైద్యం తెలుసు. చూర్ణాలు, మాత్రలు, అరిష్టాలు, ఆసవాలు, లేహ్యాలు చేసి అమ్మేవారు. అవే రచయిత జీవనోపాధిని గడిపాయి. గంధర్వకళ అని ఒక తియ్యని లేహం. అదంటే ఆయనకు అభిమానం. డబ్బు చాలా తెస్తుందని, ఆయన ఆ తియ్యని చేత్తోనే కథలు రాస్తారని మేము సంతోషించే వాళ్ళం. ఆ కొట్టులోనే పెళ్ళే సాహిత్యపరు లందరికీ విడిది.

●